క్లుప్తంగా

పాడి రైతులకు అవగాహన



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం

హిందూపురం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు నివారణ, దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలపై మండలంలోని బేవనహళ్లిలో పాడి రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. రైతు సేవ కేంద్రం సహాయకుడు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ మండలంలో ఈ శిబిరాలు ఈ నెల 30 వరకూ కొనసాగుతాయన్నారు. శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

పెనుకొండ రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీకైలాసం నుంచి శనివారం బస్సు సర్వీసును ప్రారంభించారు. పెనుకొండ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు.. పెనుకొండ నుంచి శ్రీకైలాసం మీదుగా ధర్మవరం వరకూ రాకపోకలు సాగిస్తుంది. శ్రీకైలాసం పీఠాధిపతి ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీవైఈఓ పద్మప్రియ

పెనుకొండ: మంత్రి సవితను ఆమె క్యాంప్ కార్యాలయంలో శనివారం డీవైఈఓ పద్మప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పాఠశాలల్లో పర్యవేక్షణ పెరగాలన్నారు. 10వ తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



మాట్లాడుతున్న వక్తలు

హిందూపురం: మండలంలోని మలుగూరులో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలకు ముత్తూట్ ఫైనాన్స్ కొచ్చిన్ ఎండీ జార్జి అలెగ్జాండర్ ఆర్థిక సహాయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ముత్తూట్ ఫైనాన్స్ అధికారులు సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ కింద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆర్‌బీఐఆర్‌డీ ఎంఎన్.స్వామి, ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ రమేష్, ప్రిన్సిపాల్ జి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ తిప్పేస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం అర్చకులు పూజలు చేసి మహా మంగళహారతి ఇచ్చారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రామాంజనరెడ్డి



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని హుస్సేన్‌పురంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ మద్దతుదారులు అధ్యక్షుడిగా రామాంజినరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘంలో మొత్తం 12 మంది సభ్యులు ఉన్నారు. ఇద్దరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి వెంకటేష్ తెలిపారు. స్థానిక సీనియర్ జేడీఎస్ నేత ఎస్‌కే రెడ్డి తదితర డైరెక్టర్లు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు.

జెడ్పీ నిధులపై తమ్ముళ్ల కన్ను



- టీడీపీలో రెండు వర్గాల పోరు
- లేపాక్షిలో ముదురుతున్న వివాదం

లేపాక్షి: జెడ్పీ నిధులు కాజేసేందుకు అధికార పార్టీ నాయకులు కన్నేశారు. గ్రామీణా ప్రాంతాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ఆరు నెలల కిందట మండాలనికి జెడ్పీ నుంచి రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతలో రూ.40 లక్షల నిధులతో పనులు చేసిన ఓ అధికార పార్టీ నాయకుడు నిధులు మంజూరు చేయించుకున్నాడు. రెండో విడతలో వచ్చిన రూ. 64 లక్షల జెడ్పీ నిధులు సైతం తనకే దక్కాలంటూ ఆయనతోపాటు ఆయన వర్గీయులు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అదే పార్టీకి చెందిన మరోవర్గం వారిని అడ్డుకుంటున్నారు. మండలంలోని కంచిసముద్రం పంచాయతీలో తెలుగుదేశం పార్టీలో రెండు వర్గాల మధ్య కొంతకాలంగా ఉన్న విబేధాలు భగ్గుమంటున్నాయి. అధికార పార్టికి చెందిన సర్పంచ్ అధికారంలో ఉన్నప్పటికీ అక్కడున్న రెండు వర్గాల నాయకులు సర్పంచ్‌ను డమ్మీ చేశారు. పంచాయతీకి మంజూరైన జిల్లా పరిషత్ నిధులను చేజిక్కించు కోవడానికి హిందూపురం పట్టణానికి చెందిన ఓ నాయకుడు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సర్పంచ్‌ను కాదని పనులు చేయడానికి అధికారులతో కుమ్మక్కై తీర్మాణాలు కూడా చేయించాడు. టీడీపీలో మరో వర్గం నాయకులు స్థానికంగా ఉండే నాయకులే పనులు చేయాలని, బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు పనులు చేయడం వల్ల గ్రామాల్లో ఘర్షణలు, విభేదాలు చోటు చేసుకునే అవకాశం వుందని సర్పంచ్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో రెండు వర్గాల మధ్య విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయి.

పంచాయతీలో సమావేశం

కంచిసముద్రం పంచాయతీలో జెడ్పీ నిధులతో పనులు చేయడానికి శనివారం సమావేశం ఏర్పాటు చేసారు. వార్డు సభ్యులు అందరూ అత్యవసర సమావేశానికి హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి అజెండా కాపీలను జారీ చేశారు. అయితే 12 మంది వార్డు సభ్యుల్లో నలుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అజెండాలో ఉన్న అంశాలను కార్యదర్శి సభ్యులకు చదివి వినిపించకుండా సంతకాలు తీసుకున్నారు. వారు సంతకాలు చేసిన వెంటనే తీర్మానం చేశామనే సాకుతో వెళ్లి పోయారు.

దళిత సర్పంచ్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా?

అధికార పార్టి నాయకుడు హిందూపురం పట్టణానికి చెందిన గ్రీన్ పార్కు నాగరాజుతో పాటు ఆయన అనుచరులు దళిత మహిళా సర్పంచ్ అయిన నన్ను ప్రతి విషయంలోను అగౌరవపరుస్తున్నారు. పంచాయితీ నిధులు కేటాయింపుల్లో తన ప్రమేయం లేకుండా వ్యవహరిస్తున్నారు. దళిత మహిళ సర్పంచ్‌కు ఇచ్చే గౌరం ఇదేనా సర్పంచ్ గంగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆమె పేర్కొన్నారు.



కంచిసముద్రం గ్రామ సచివాలయం

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

హిందూపురం టౌన్: ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎస్ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగడానికి నీరు, గదుల్లో వెలుతురు ఉండే విధంగా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల దగ్గర నుంచి వేల రూపాయలు డబ్బులు వసూలు చేయడమే కాకుండా పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ పేరుతో అదనంగా డబ్బు వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డబ్బు వసూలు చేసిన కోఆర్డినేటర్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు భగత్, సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సాయిరాం, రాజు, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రాజేష్, సుహేల్, విఘ్నేష్, చక్రి పాల్గొన్నారు.

ఖాతాల ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

పావగడ: ఖాతాలతో ఆస్తుల భద్రతతో పాటు రుణ సౌకర్యం కూడా లభిస్తుందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సభాంగణంలో ఈ ఖాతా ధ్రువీకరణ పత్రాల వితరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు వార్డులలో పర్యటించి, ఖాతాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ ఖాతాలు పొందితే తమ పిల్లల చదువులు, చిరు వ్యాపారాల నిర్వహణకు తమ ఇళ్లను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి సకాలంలో రుణ సౌకర్యం పొందొచ్చన్నారు. వేసవి కాలం సమీపిస్తుండడంతో పట్టణంలో నీటి కొరత రాకుండా మున్సిపల్ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్, ఉపాధ్యక్షురాలు గీత హనుమంతరాయప్ప, కౌన్సిలర్లు సుదేశ్ బాబు, గొర్తి నాగరాజు, మహ్మద్ ఇమ్రాన్, టెంకాయల రవి, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ పాల్గొన్నారు.



మహిళలకు ఖాతా ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

సంక్షిప్త సమాచారం

విద్యా సామగ్రి పంపిణీ

గోరంట్ల: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 617 మంది విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి (పరీక్ష అట్టలు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మూఢాచారాలను పారదోలాలి

పావగడ: సాంఘిక మూఢాచారాలను పారదోలి యాదవ సామాజికవర్గం అభివృద్ధికి కృషి చేయాలని నివృత్త కమిషనర్ ఆఫ్ పోలీస్ కోదండ రామయ్య యాదవ కులస్తులకు సూచించారు. తాలూకాలోని కెంచమ్మనహళ్లి గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవం పాలేన హళ్లి చిత్ర లింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. జల మండలి అధికారి సణ్ణ చిత్తయ్య, బీసీ వర్గాల తాలూకా అధ్యక్షుడు మైలారరెడ్డి, అంజనరెడ్డి, సీఎస్‌సీ కంపెనీ నిర్వాహకుడు చిత్తప్ప హీరేతుర్పి పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న లారీ

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటును శనివారం ఓ లారీ ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. బెంగళూరు వైపు వెళ్లే రైలు కోసం గేట్‌మెన్ గేటు వేస్తుండగా.. హిందూపురం వైపు వెళ్లే లారీ ఢీకొట్టింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలు వస్తున్న క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైలు వెళ్లడానికి మార్గం సుగమమైంది. ఘటనకు కారణమైన లారీ డ్రైవర్‌పై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు రాజరాజేశ్వరి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈఓ ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర ప్రసాద్, లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు, జవాజీ నాగరజారావు, రఘునాథ్ రావు. శ్రీనివాసులు, సంజీవ రాయుడు, ఇర్ఫాన్, రంగేష చంద్ర, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

రొళ్ల: మండలంలోని దాసప్పపాళ్యం–జీఎస్ పాళ్యం గ్రామ సరిహద్దు కొండ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు శనివారం ఎస్ఐ వీరాంజినేయులు తెలిపారు. వారి నుంచి రెండు పందెం కోళ్లతో పాటు రూ.3,150 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఘనంగా సరస్వతీ పూజ

పెనుకొండ రూరల్: గుట్టూరు ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం సరస్వతీ పూజను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హెచ్ఎం నాగార్జునుడు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం.రఘు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు సరస్వతి దేవి, గణపతి పూజను శనివారం నిర్వహించారు. ఎంఈఓ రవిచంద్రన్ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా రాయాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యామందిరం వార్షికోత్సవం

అమరాపురం: స్థానిక శ్రీ సరస్వతి విద్యామందిరంలో శనివారం రాత్రి 39వ పాఠశాల వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల కమిటీ సభ్యులు జరుపుకున్నారు. పాఠశాల నివేదికను హెచ్ఎం మురళీకృష్ణ చదివి వినిపించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అమరవీరులకు ఘన నివాళి



హిందూపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన ఎమ్మార్పీఎస్ నేతలకు శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ కోసం 30 సంవత్సరాల పాటు ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు సతీష్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆంజినేయులు, పార్లమెంట్ అధ్యక్షుడు ఆనంద్, తాలూకా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, రామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు నరసింహులు, రూరల్ ఇన్‌చార్జ్ నాగార్జున, ఎంఈఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేసి అమరులైన వీరులకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీస్ నాయకులు శనివారం నివాళులర్పించారు. సర్పంచ్ ఆదినారాయణ, మండల నాయకులు నారాయణప్ప, నరసింహులు , మూర్తి, పవన్, చంద్ర, నవీన్, మద్దిపి అశ్వత్థప్ప, టైలర్ మూర్తి, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి

మడకశిర: ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదగ కోరారు. శనివారం పట్టణంలోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు అధ్యక్షత సమావేశం వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ పోరులో అమరులైన మాదిగ కుటుంబాలను రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌లో ఎస్సీలకు కేటాయించిన నిధులను ఎస్సీల అభివృద్ధికే ఖర్చు పెట్టాలని కోరారు. సమావేశంలో స్థానిక నాయకులు అంజినప్ప, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఉమేష్‌నాయక్, రఘునాథ్, అంజి, హనుమంతు, కాంతరాజు, రామకృష్ణ, మూర్తి, నరసింహరాజు, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ సిటిజన్స్‌ను గుర్తించడానికి చర్యలు



రొళ్ల మండలం హొట్టేబెట్టలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

రొళ్ల: రేషన్ కార్డులోని లబ్ధిదారులు పేర్లు ఉండి అందుబాటులో లేని (మిస్సింగ్ సిటిజన్స్) లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని హొట్టేబెట్ట గ్రామ సచివాలయాలన్ని సందర్శించారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డులో కుటుంబ సభ్యుల అందరితోను ఈ–కేవైసీ తప్పని సరిగా డీలర్లు చేయించాలన్నారు. ఎన్‌టీఆర్ సామాజిక భద్రత పింఛన్‌ను గ్రామాల్లో ఒక చోట కూర్చొని అందించకుండా ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, కార్యదర్శి బాబురావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడగార్లగుట్ట అడవికి నిప్పు

రొళ్ల: మండలంలోని కొడగార్లగుట్ట గ్రామ సమీపంలో టీడీ పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న అటవీ ప్రాంతానికి శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో అడవి ప్రాంతో పెంచిన వేలాది నీలగిరి చెట్లతో పాటు వివిధ రకాల చెట్లు కాలి బూడిదయ్యాయి. టీడీ పల్లి, కొడగార్లగుట్ట, కేపీ తండా, కొత్తపాళ్యం, హొట్టేబెట్ట, అగ్రహారం, జీజీ హట్టి, గుడిబండ మండలం ఎస్.రాయాపురం, పూజారిపల్లి, మేకలగట్ట తదితర గ్రామ సరిహద్దులో లక్షల ఎకరాల అడవి ప్రాంతం విస్తరించి ఉంది. అందులో వేలాదిగా నెమళ్లు, కుందేలు, అడవి పందులు, ఎలుగుబంట్లు ఇతరాత్ర వన్యప్రాణులు జీవిస్తున్నాయి. అడవికి నిప్పు పెట్టడంతో వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

లేపాక్షి: మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఎస్ఓ నీలిమా అధ్యక్షతన జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లను రక్షిద్దాం..ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదాంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, భాగ్యమ్మ, సుజాతమ్మ, పార్వతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అంగన్వాడీ కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. బాలికల చదువు అవనికి వెలుగు, బాలికల బాధ్యత–సామాజిక బాధ్యత అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, పుష్ప, ఎర్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

హిందూపురం టౌన్: ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. హిందూపురం పట్టణంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించలేదు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ కేంద్రాలు, ప్రింటింగ్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను అధికారులు మూసివేయిచారు.

లేపాక్షి: లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను కేంద్రాలను శనివారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మెడికల్ క్యాంపులను పరిశీలించారు. 252 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రొద్దం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఉదయశంకర్ రాజు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లపై ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. 122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. ఐదుగురు గైర్హాజరయ్యారు. ఒక విద్యార్థి ఆలస్యంగా రావడంతో వెనక్కి పంపారు.

మడకశిర: నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షలు తొలి రోజు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 7 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మడకశిరలో 4, అగళి, గుడిబండ, అమరాపురంలో ఒక్కో కేంద్రంలో పరీక్షలను నిర్వహించారు. తొలి రోజు మొత్తం ఇంటర్ విద్యార్థులు ఏడు కేంద్రాల్లో 2,165 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. 2,055 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు.

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆర్డీఓ ఆనంద కుమార్, తహసీల్దార్ సుబ్బరావు శనివారం తనిఖీ చేశారు. అనంతరం పరిక్ష నిర్వాహకులకు వారు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ జాఫార్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 196 మంది హాజరయ్యారు.

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. మొత్తం 302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 12 మంది గైర్హాజరైనట్లు సీఓ రామకృష్ణానాయక్ తెలిపారు.

గుడిబండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రిన్సిపాల్ యశ్వంత్ మాట్లాడుతూ ఎంజేపీ, గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 272 మంది పరీక్షలు రాశారన్నారు.



హిందూపురంలోని పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

పెనుకొండ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే తమ లక్ష్యమని ప్రగతి, గ్లోబల్‌జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పాఠశాల 36వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నైతిక విలువలను విద్యార్థులకు నేర్పించడంలో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రగతి, గ్లోబల్‌జెన్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నతమైన ర్యాంకులు సాధించారన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీవైఈఓ పద్మప్రియ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కోత

మడకశిర: అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ పథకాలకు కోత విధించే విధంగా ఉందని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకుండా పేదలను మోసం చేశారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 50 ఏళ్ల కే పింఛన్లు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపారని అన్నారు. మహిళలు,నిరుద్యోగులకు కూడా ఈబడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి ఊసే లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను దొమ్మితి మర్రి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పి.రొప్పాల గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించారు. విచారణ చేపట్టి జరిమానా విధిస్తామని తహసీల్దార్ ఉదయశంకర్ రాజు తెలిపారు.

భూ సమస్యలపై విచారణ

గోరంట్ల: భూ సమస్యల పరిష్కారం కోసం శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పుట్టపర్తి ఆర్డీఓ కోర్టు నిర్వహించారు. 16 భూ సమస్యలపై విచారణ జరిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

పారదర్శకత పాటించండి

చిలమత్తూరు: రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ డీలర్లకు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన మండల కేంద్రంలో గల రేషన్ దుకాణాలను పరిశీలించి పంపిణీ సరళిని పరిశీలించారు. అనంతరం ఆయన జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఎఫ్‌పీ షాపు తనిఖీ

లేపాక్షి: మండలంలోని మామిడిమాకుపల్లిలో ఎఫ్‌పీ షాపును తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తనిఖీ చేశారు. సరకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, సమయానికి ఇస్తున్నారా అంటూ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు.

కష్టపడి చదివితే విజయం సాధ్యం

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలను సాధించగలరని తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినులతో మాట్లాడారు. పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓ సువర్ణమ్మ, ఆర్ఐ సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.

సజావుగా పీయూసీ పరీక్షలు

పావగడ: స్థానిక ద్వితీయ పీయూసీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణం లోని జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో కన్నడ పరీక్ష సజావుగా సాగింది. మొత్తం పట్టణంలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వెలుపల గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో కన్నడ పరీక్ష రాయడానికి నితిన్ అనే దివ్యాంగ విద్యార్థి తల్లి తండ్రుల సహాయంతో పరీక్ష రాయడానికి వచ్చాడు.

ఫ్లిప్‌కార్ట్ నుంచి డబ్బు ఇప్పించండి

గోరంట్ల: ఫ్లిప్‌కార్ట్ కంపెనీ నుంచి తమకు డబ్బు ఇప్పించాలని బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు..బాధితులు జనార్దన్, జయచంద్ర స్థానిక ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో కొంత కాలం నుంచి టీం లీడర్లుగా పని చేసేవారు. ఇటీవల సంస్థ కార్యాలయాన్ని ఉనఫలంగా మూసేసింది. అయితే టీం లీడర్లు ఇద్దరికీ రెండు నెలల వేతనాలు ఇవ్వలేదు. దాదాపు రూ.2 లక్షల దాకా సంస్థ నుంచి రావాల్సి ఉంది. తమకు సంస్థ నుంచి డబ్బు ఇప్పించాలని బాధితులిద్దరూ సీఐ బోయ శేఖర్‌ను కోరారు. వేడుకున్నారు.